VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 02 మార్చి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 194




## భాజపాకు కౌంట్‌డౌన్ మొదలైంది

శాస్త్రవేత్త, బాలల విద్య కోసం పనిచేసిన వాంగ్‌చుక్‌కు భయపడి ఆయనను జైలుకు పంపారు. మహిళా ఎంపీలు దాడి చేస్తారేమోనని బెదిరి పార్లమెంటుకు వెళ్లలేదు. ట్రంప్‌నకు కూడా మోదీ భయపడతారు.


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో

# ఖమేనీ మృతి

- యుద్ధం తొలి రోజే ఇరాన్ సుప్రీం నేత మరణం
- 40 మంది అత్యున్నత సైనికాధికారులు కూడా
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ భీకర ప్రతీకార దాడులు
- విమానాశ్రయాలు, బుర్జ్ ఖలీఫా సహా పలు భవనాలకు నష్టం
- ఆయా దేశాల్లో పలువురి మరణం.. గాయాలు
- నిలిచిపోయిన విమానాలు.. చిక్కుకుపోయిన వేల మంది
- ఇరాన్ దాడి చేసిన నౌకలో భారతీయులు



అమెరికా యుద్ధ నౌకపై క్షిపణులు పేల్చామన్న ఐఆర్‌జీసీ ఖమేనీ వారసుడి ఎన్నిక నేడో రేపో.. హత్యపై ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు

ఇరాన్ సైనిక బలగాల చీఫ్ ఆఫ్ స్టాఫ్.. అబ్దోల్‌రహీం మౌసావి, రక్షణ మంత్రి అజీజ్ నసీర్జాదే, భద్రతా సలహాదారు అలీ శంఖానీ తదితరులు అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన వారిలో ఉన్నారు. ఆదివారమూ ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. 9 ఇరాన్ చమురునౌకలను ముంచేశామని, నౌకాదళ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు.

-2లో

## కొత్త నాయకత్వంతో చర్చలకు సిద్ధం: ట్రంప్



వాషింగ్టన్: ఇరాన్ కొత్త నాయకత్వం తనతో చర్చలను కోరుకుంటోందని, దానికి తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'వారు చర్చలను కోరుకుంటున్నారు. నేను అంగీకరించా. వారితో మాట్లాడతా. ఈ పనిని వారు త్వరగా చేయాలి' అని ట్రంప్ పేర్కొన్నారు. చర్చలు ఎప్పుడు జరుగుతాయన్న అంశాన్ని ఆయన వెల్లడించలేదు.




## ఫిబ్రవరిలో నికర జీఎస్టీ ఆదాయం

# రూ.3,061 కోట్లు

అమరావతి: నికర జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరిలో వృద్ధి నమోదు చేసింది. జీఎస్టీ అమలైనప్పటి నుంచి ఫిబ్రవరి నెలల్లో వసూళ్లను పరిగణనలోకి తీసుకుంటే..ఈ ఏడాది ఫిబ్రవరి వసూళ్లే అధికం. ఈ ఏడాది ఫిబ్రవరి నికర జీఎస్టీ రూ.3,061 కోట్లు కాగా.. గతేడాది ఇదే నెలలో రూ.2,902 కోట్లే వసూళ్లు కావడం గమనార్హం. ఈ లెక్కన జీఎస్టీ కింద రూ.159 కోట్లు అదనంగా వసూలైంది. ప్రధాన సరకులు, వినియోగ వస్తువులు, ఔషధాలు, సిమెంట్‌పై పన్ను రేట్లు తగ్గినా, జీఎస్టీ 2.0 సంస్కరణ వల్ల జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీ ఉపసంహరణ జరిగినా నికర వసూళ్లలో వృద్ధినే నమోదు చేసింది. పన్ను రేటు తగ్గింపులు, వ్యూహాత్మక చర్యలు, మెరుగైన విధానాల వల్ల వినియోగం పెరగటం రాష్ట్ర ఆదాయ వృద్ధికి దోహదపడిందని రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు.ఎ తెలిపారు.

**2026 ఫిబ్రవరిలో నికర జీఎస్టీ**

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. వరుసగా 11 నెలల పాటు జీఎస్టీ నికర వసూళ్లు అధికంగా నమోదయ్యాయి.

వివిధ వస్తువులపై పన్ను రేట్లు తగ్గినా.. 2025 ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే.. నెట్ జీఎస్టీ వసూళ్లలో 5.45% మేర వృద్ధి నమోదైంది. ప్రతినెలా (5.86%) క్యుమిలేటివ్ జీఎస్టీ వసూళ్లతో దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ 2025-26లో మొదటి స్థానంలో ఉంది.

**స్వల్పంగా తగ్గిన స్థూల జీఎస్టీ**

పన్ను రేట్ల తగ్గింపు, పొగాకు, మద్యం, విలాస వస్తువులు మినహా.. మిగిలిన వస్తువులపై సెస్సు మినహాయించాక 2026 ఫిబ్రవరిలో గ్రాస్ జీఎస్టీ కింద రూ.3,562 కోట్లు వసూలైంది. అది 2025 ఫిబ్రవరిలో రూ.3.569 కోట్లుగా ఉంది. పన్ను రేట్ల తగ్గింపు, అన్ని ఉత్పత్తులపై సెస్ ఉపసంహరణ ప్రభావంతో స్వల్పంగా 0.22% తగ్గింది.

## రాష్ట్రంలో కాంగ్రెస్

# బుల్డోజర్ రాజ్యం



**"రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యాన్ని నడుపుతోంది. ఇళ్లను కూల్చడం, భూములను అమ్మడం, రియల్ ఎస్టేట్ దందా చేయడం... ఇదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన" అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. "రెండేళ్లు మీ ఇళ్లు, భూములను కాపాడుకోండి.**

బండ్లగూడ :భారాస ప్రభుత్వం వచ్చాక వాటిని ముట్టుకోకుండా చూసుకునే బాధ్యత మాది" అంటూ మూసీ ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు హామీ ఇచ్చారు. ఆదివారం నగరంలోని హైదర్షాకోట్, బండ్లగూడజాగీర్ డివిజన్ల పరిధిలోని మూసీ ప్రభావిత ప్రాంతంలో భారాస రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.కార్తీక్‌రెడ్డి, మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన మూసీ దండిమార్చ్ పేరిట మూడున్నర కిలోమీటర్ల మేర నాలుగు గంటలపాటు పాదయాత్ర చేశారు. 'సేవ్ మూసీ.. సేవ్ హోమ్స్' నినాదంతో ఉదయం 10 గంటలకు మొదలైన యాత్ర మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగింది. తొలుత గంధంగూడలోని విఘ్నేశ్వరకాలనీ, హైదర్షాకోట్, బండ్లగూడజాగీర్‌లోని మధుపార్క్ రిడ్జ్ అపార్టుమెంటు వాసులతో భేటీ అయ్యారు. గంధంగూడలోని జేఎన్ఎన్‌యూ ఆర్ఎం గృహ సముదాయంలో నివాసముంటున్న వారితోనూ మాట్లాడారు. అనంతరం హైదర్షా కోట్‌లోని కేంద్రీయ విహార్, మధుపార్క్ రిడ్జ్ వద్ద నిర్వహించిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. "భారాస హయాంలో మూసీ సుందరీకరణలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా మేం ఉప్పల్ భగాయత్, నాగోల్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో 5 కి.మీ. మేర సుందరీకరణ చేసినా... ఎక్కడా ఒక్క ఇంటిని కూల్చలేదు. రూ.3,666 కోట్లతో ఎస్టీపీలను నిర్మించాం.



## ప్రజాపాలనలో ప్రజలు ఇళ్లల్లో

# ఉండొద్దా..?

ఖమ్మం: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల ఇళ్లను కూలగొట్టి వారి కడుపు కొడుతోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్ల వినోబా నగర్‌లో ఇటీవల అధికారులు తొలగించిన ఇళ్ల శిథిలాలను ఆదివారం పరిశీలించారు. పునరావాస కేంద్రం అంబేద్కర్ భవనంలో సామగ్రి భద్రపర్చుకొని ఉంటున్న నిర్వాసితులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. "పైసా పైసా కూడబెట్టి ఇళ్లు కట్టుకున్న నిరుపేదల కలల గృహాలను ప్రభుత్వం కూలగొట్టింది. భూదాన్ బోర్డు హక్కు పత్రాలున్నా ఇళ్లను కూల్చటం తగదు. ప్రజాపాలనలో పేదలు ఇళ్లల్లో ఉండకూడదా? న్యాయపోరాటం చేయాల్సిన సర్కారు దండయాత్రకు దిగింది. వినోబా నగర్ పక్కన నూతన కలెక్టరేట్ కొలువుదీరటం, జాతీయ రహదారి వస్తుండటంతో భూమి విలువ పెరిగింది. విలువైన చోట పేదలు ఉండకూడదని ప్రయత్నాలు చేస్తున్నారు. పేదలకు అన్యాయం జరగకుండా కూల్చిన చోటే 100 గజాల చొప్పున భూమిచ్చి, ఇళ్లు నిర్మించాలి" అని అన్నారు. భాజపా రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఖమ్మం అంబేడ్కర్ భవనం వద్ద ఉద్రిక్తత



ఖానాపురం:ఖమ్మం అంబేద్కర్ భవనం వద్ద ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. వెలుగుమట్ల భూదాన్ భూమి నిర్వాసితులను అంబేద్కర్ భవన్‌లోని పునరావాస కేంద్రంలో ఉంచారు. ఆదివారం హైదరాబాద్ వర్సిటీకి చెందిన విద్యార్థి సంఘం నాయకుడు రాకేశ్ దత్త, తెలంగాణ బహుజన శక్తి పార్టీకి చెందిన రాజు ఖమ్మంకు వచ్చి వారికి మద్దతు తెలిపి దీక్షకు కూర్చున్నారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు రాగా.. పునరావాస కేంద్రంలో ఉన్న మహిళలు అరెస్టును అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అడ్డువచ్చిన మహిళలను ఈడ్చేయడంతో కొందరికి గాయాలయ్యాయి. వారు వైరా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాసేపటికి పోలీసులు వారిని అంబేద్కర్ భవనంలోకి తరలించారు.



## ఎప్పటికప్పుడు కేంద్రంతో

# సమన్వయం

హైదరాబాద్: ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. "ఆయా దేశాల పరిధిలో ఉన్న తెలుగు ప్రజలు భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలు పాటించాలి. అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనే వారిని సురక్షితంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్రంతో సమన్వయం చేసుకుంటుంది. ఇరాన్, గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోంది. వారి భద్రత కోసం కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర అధికారులు సమన్వయం చేసుకుని కావాల్సిన చర్యలు తీసుకోవాలి. భారత ఎంబసీ, కాన్సులేట్‌తోనూ సంప్రదింపులు జరపాలి. తెలంగాణ ప్రజల భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం" అని సీఎం తెలిపారు.

# అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ మృతి

ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై శనివారం రాత్రి ఇరాన్ విరుచుకుపడింది. బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లలోని స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. డజన్లకొద్దీ క్షిపణులను, వందలకొద్దీ డ్రోన్లను ఇరాన్ ప్రయోగించిందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.






అమెరికా, ఇజ్రాయెల్ అనుకున్నంత పనీ చేశాయి. రెండు దేశాలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. యుద్ధం ప్రారంభమైన తొలి రోజే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఆయన కార్యాలయంపై దాడులు చేయడంతో ఖమేనీతోపాటు 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ మృతిని ఆదివారం ఉదయం ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఇర్నా అధికారికంగా ప్రకటించింది. ఆ వార్త దావానలంలా వ్యాపించడంతో భారత్‌సహా ప్రపంచ వ్యాప్తంగా షియా ముస్లింలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నిరసనల సందర్భంగా పాకిస్థాన్‌లోని కరాచీలో 10 మంది మృతి చెందారు. మరోవైపు ఇరాన్ తీవ్రంగా ప్రతీకార దాడులు చేసింది. దీంతో యుద్ధం మరింత విస్తరించింది. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. విమానాశ్రయాలు, దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాసహా పలు భవనాలకు నష్టం కలిగింది. ఇజ్రాయెల్‌లో 11 మంది చనిపోగా.. తమ సైనికులు ముగ్గురు మరణించారని అమెరికా ప్రకటించింది. గల్ఫ్‌లోని మరిన్ని చోట్లా మరణాలు సంభవించాయి. చాలా మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో భారతీయులూ ఉన్నారు. పశ్చిమాసియాలో ఆదివారమూ వందల విమానాలు రద్దయ్యాయి. భారత్ నుంచి దాదాపు 220 విమానాలు నిలిచిపోయాయి. దీంతో వేల మంది విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. అమెరికా యుద్ధ నౌకపై క్షిపణులు పేల్చామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. మరోవైపు ఖమేనీ వారసుడి ఎన్నిక ఒకట్రెండు రోజుల్లో జరగనుంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ డౌన్‌టౌన్‌లోని ఖమేనీ కార్యాలయంపై భారీగా బాంబు దాడులు జరిగిన దృశ్యాలు శాటిలైట్ చిత్రాల్లో కనిపించాయి. ఈ దాడుల్లోనే 86 ఏళ్ల ఖమేనీ మరణించినట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఆయనతోపాటు కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందారు. చరిత్రలోనే అత్యంత దుర్మార్గమైన వ్యక్తి మరణించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఖమేనీతోపాటు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ అత్యున్నతాధికారి, ఖమేనీ భద్రతా సలహాదారు మేజర్ జనరల్ మహమ్మద్ పాక్‌పౌర్ మరణించారు. ఖమేనీ మరణంతో టెహ్రాన్‌లో కొందరు భవనాల పైకి వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు వేల మంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. షియా ముస్లింల ప్రధాన ఆధ్మాత్మిక కేంద్రమైన మషాద్‌లో జెండాను అవనతం చేశారు. ఖమేనీపై దాడుల వివరాలను ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ఆదివారం వెల్లడించింది. వైమానిక దాడుల్లోనే ఆయన మరణించారని పేర్కొంది. శనివారం ఉదయం.. డజన్ల సంఖ్యలోని సైనిక స్థావరాలపై విస్తృత స్థాయిలో, సమన్వయంతో అమెరికాతో కలిసి దాడులు చేశామని తెలిపింది. ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలపై అమెరికా బీ-2 స్టెల్త్ బాంబర్లను వేసింది. ప్రభుత్వాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చినా ఇరాన్‌లో పెద్దగా స్పందన కనిపించలేదు. ఆదివారం టెహ్రాన్‌లో వీధులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. యూఏఈలోని విమానాశ్రయం, పలు ఇతర భవనాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. దుబాయ్ విమానాశ్రయం, బుర్జ్ ఖలీపాలపై దాడులు జరిగాయి. క్షిపణుల కారణంగా బుర్జ్ అల్ అరబ్ హోటల్‌వద్ద మంటలు వచ్చాయని, అయితే ఎవరికీ గాయాలు కాలేదని యూఏఈ ప్రభుత్వం వెల్లడించింది. జెబెల్ అలీ పోర్టువద్ద క్షిపణులను రక్షణ వ్యవస్థలు అడ్డుకోవడంతో శిథిలాలు పడ్డాయని, ఎవరికీ గాయాలు కాలేదని తెలిపింది. దుబాయ్ విమానాశ్రయంవద్దా అత్యవసర పరిస్థితి తలెత్తింది. మొత్తంగా ఇప్పటిదాకా యూఏఈలో ముగ్గురు మరణించగా.. 58 మంది గాయపడ్డారు. చనిపోయిన వారిలో పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్ జాతీయులున్నారు. అబుధాబిలోని జాయేద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం రాత్రి ఇరాన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇద్దరు మృతి చెందగా ఏడుగురు గాయపడ్డారు. ఇప్పటిదాకా 165 క్షిపణులు, 541 డ్రోన్లు తమ దేశం దిశగా దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. 152 క్షిపణులను కూల్చేశామని, మిగిలినవి సముద్రంలో కూలిపోయాయని వివరించింది. 506 డ్రోన్లను కూల్చేశామని, మిగిలినవి భూభాగంతోపాటు సముద్రంలో కూలిపోయాయని తెలిపింది.

### ఇప్పటిదాకా మృతులు, గాయపడినవారు

| దేశం | మృతులు | గాయపడినవారు |
|---|---|---|
| ఇరాన్ | 201 | 747 |
| ఇజ్రాయెల్ | 10 | 120 |
| అమెరికా | 3 | 5 |
| ఇరాక్ | 2 | 5 |
| కువైట్ | 1 | 32 |
| బహ్రెయిన్ | - | 4 |
| ఖతార్ | - | 16 |
| యూఏఈ | 3 | 58 |
| ఒమన్ | - | 5 |

స్ట్రెయిట్ ఆఫ్ హర్మ్యూజ్‌లో చమురు నౌకపై జరిగిన దాడిలో నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఈ నౌకలో భారతీయ సిబ్బందీ ఉన్నారు. 3 బ్రిటన్, అమెరికా చమురు నౌకలపై దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది. ఈ జలసంధిపై దాడులు జరుగుతుండటంతో చమురు రవాణాకు అంతరాయం కలిగే అవకాశముంది.

ఇరాన్ క్షిపణులను అడ్డుకున్నామని ఖతార్, బహ్రెయిన్, కువైట్ ప్రకటించాయి. ఖతార్‌లో 16 మంది గాయపడ్డారు. మినాబ్‌లో పాఠశాల భవనంపై బాంబులు పడిన ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 165కి చేరుకుంది. ఇజ్రాయెల్‌లో భారీ పేలుళ్లు సంభవించాయి. ఇరాన్ జరిపిన ఈ దాడుల్లో 9 మంది మృతి చెందగా.. 28 మంది గాయపడ్డారు. బీట్ షెమెష్‌లోని సైనాగోగ్‌పై ఈ దాడి జరిగింది. దీంతో ఇప్పటిదాకా ఇజ్రాయెల్‌లో 11 మంది మృతి చెందినట్లయింది. మరో 9 మంది గల్లంతయ్యారు. 120 మంది గాయపడ్డారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా ముగ్గురు సైనికులు మరణించారని, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని అమెరికా వెల్లడించింది.

విమాన వాహక యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌పై నాలుగు బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ దాడి చేసింది. అయితే ఈ వార్తలను అమెరికా సైన్యం ఖండించింది. 49 డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నామని జోర్డాన్ వెల్లడించింది. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే ప్రక్రియను కౌన్సిల్ ప్రారంభించిందని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ గీత దాటాయని, మూల్యం చెల్లించుకుంటాయని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘెర్ ఖలీబా హెచ్చరించారు.

# చెంపదెబ్బ...గోడదెబ్బ !



దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళ్లు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి.ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే..ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది. కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు. అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తేలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమికి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది. ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యూడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదారీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని సిజెఐ అనడం చూస్తుంటే..ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధించాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరి ణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు

. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయడం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు.

## మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు
### పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు



న్యూఢిల్లీ: దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ.3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి.

గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ.3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ.2,900ల మేర పెరిగి రూ.1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ.5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3 లక్షలుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ.1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ.1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ.1,64,880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ.1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,51,000 వద్ద కొనసాగుతోంది. నగరాల వారీగా వెండి ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో కిలో వెండి ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.2.95 లక్షల వద్ద కొనసాగుతోంది.


## తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు అరుదైన వన్యప్రాణులు
### పరస్పర మార్పిడితో జంతువుల రాక

తిరుపతి: తిరుపతి ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణులు రానున్నాయి. విశాఖ జూపార్కు, హైదరాబాదు జూపార్కు, చెన్నైలోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రానున్నాయి. పరస్పర వన్యప్రాణి మార్పిడి విధానం ద్వారా వీటిని తెప్పించనున్నట్లు ఇక్కడి జూ అధికారులు చెప్పారు. తిరుపతినుంచి గరియల్-2, ఇండినగ్ గౌడ్-2, జపనీస్ కోయల్ -4, మస్కోవి డెక్ -4, గే పిలికాన్ -2, వైటఖ్ ఈబీస్ 2 హైదరాబాద్ లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు పంపిస్తారు. అక్కడినుంచి మగ్గర్ క్రోకోడైల్స్ -4, ఇండియన్ మౌస్ డీర్-6, రింగ్ నెక్కుడ్ పీసెంట్ -2, గో÷-డలెన్ పీసెంట్-2, సిల్వర్ పీసెంట్ -1, రెడ్ జంగిల్ ఫోవల్ -2, జంధ్యాకోనూరే 2 ఇక్కడికి రానున్నాయి. మద్రాస్ క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు నుంచి మొసళ్లు-5, ఉప్పునీటి మొసళ్లు 2, ఎల్లో అనకొండ-9 ఎస్వీ జూపార్కుకు రానున్నాయి. విశాఖలోని ఇందిరాగాంధీ జువాజికల్ పార్కు నుంచి ఒక తెల్లపుల్లి ఎస్వీ జూపార్కుకు రానుండగా ఇక్కడున్న తెల్లపులిని వారికి పంపిస్తారు. రెండు అడవికుక్కలు, ఒక తోడేలు, రెండు జింకలు, బూడిదరంగు అడవికోళ్లు రెండు విశాఖ జూకు పంపించనున్నారు. దానికి బదులుగా అక్కడి నుంచి ఒక తోడేలు, రెండు అడవికుక్కలు, రెండు అడవిపిల్లులు, రెండు నీల్‌గై, నాలుగు గ్రీన్ ఇగ్వనాలను తిరుపతి జూపార్కుకు అందజేయనున్నారు. జామ్‌నగర్‌కు తెల్లపులి ఒకటి, ఇండియన్ గౌర్ రెండు, బ్లాక్ బక్-10, సాంబార్-10, బార్కింగ్ డీర్-2, మస్క్వేడక్-2, జాగ్వర్ ఒకటి అందజేస్తారు.

వేగుచుక్క

# ముందస్తు రోగ నిర్ధారణతో..
# ప్రమాదకర వ్యాధులను అరికట్టవచ్చు.









**ప్రముఖ ఆర్థో డాక్టర్ సుజిత్ కుమార్ వెల్లడి.**

**నిజామాబాద్ లో మొట్టమొదటి సారిగా 15 ఏళ్ల అనుభవం గల హైదరాబాద్ వైద్యుడి సేవలు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ముందస్తు రోగ నిర్ధారణతో ప్రమాదకర వ్యాధులను అరికట్టవచ్చనీ, ఎలాంటి కీళ్ల సమస్యలనైనా నిర్లక్ష్యం చేయవద్దని ప్రముఖ ఆర్థో డాక్టర్ సుజిత్ కుమార్ వెల్లడించారు. ఆర్థో విభాగంలో 15 ఏళ్ల సుదీర్ఘ అనుభవం గలఎంఎస్ (ఆర్థో), ఎంసిహెచ్ (ఆర్థో), ఏఏఎఫ్ (జపాన్), ఎస్ఈఎఫ్ (జర్మనీ), ఐ దబ్ల్యూసి (పారిస్), ఎఫ్ఐఎఫ్ఏ డిప్లొమా (ఫుట్‌బాల్ మెడిసిన్) సీనియర్ కన్సల్టెంట్ – కీళ్ళు, చేయిమరియు క్రీడల గాయాల నిపుణుడు డాక్టర్ సుజిత్ కుమార్ వకాటి నిజామాబాద్ లో మొట్టమొదటి సారిగా వైద్య సేవలు అందించడానికి హైదరాబాద్ వైద్యుడు ముందుకు వచ్చాడు. ప్రతి నెల మొదటి ఆదివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదురుగా ఉన్న విశ్వం డయాగ్నోస్టిక్ లో అధునాతన వ్యాధి నిర్ధారణ యంత్రాలతో తమ సేవలు అందిస్తున్నాడు. హైదరాబాద్ లో సాయి మేధ ఆసుపత్రి నిర్వహణతో పాటు అపోలో ఆసుపత్రిలో వైద్య సేవలు నిర్వహిస్తున్నాడు. ఆదివారం వేగుచుక్క న్యూస్ తో పలు ఆర్థో వ్యాధుల గురించి డాక్టర్ సుజిత్ కుమార్ వకాటి వెల్లడించారు.

**వేగుచుక్క న్యూస్: ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు.**

డాక్టర్ : ప్రతి కీళ్ల సమస్యలకు కచ్చితమైన పరిష్కారం చూపించడం జరుగుతుంది. మోకాలు, భుజం మరియు తుంటి నొప్పి, చేయి మరియు మణికట్టు గాయాలు, పాదం, చీలమండలం గాయాలు, క్రీడలు, లిగమెంట్ గాయాలు, కీళ్ల వాతం, ఆస్టియోపోరోసిస్ స్క్రీనింగ్ తో వైద్య సేవలు అందించడం జరుగుతుంది.

**వేగుచుక్క న్యూస్: అందుబాటులో ఉన్న వైద్య సేవలు ఏమిటి.**

డాక్టర్ : అందుబాటు ధరల్లో హైదరాబాద్ లో లభించే రోగ నిర్ధారణ సేవలు. ఎక్స్–రే (ఒక కీలు), మోకాలు, భుజం, మణికట్టు లేదా చీలమండలం కోసం. ఏంఆర్ఐ స్కాన్, ఆర్థోపెడిక్– కేంద్రీకృత ప్యాకేజీలు, సిటీ స్కాన్ తో అధునాతన ఎముక, కీలు ఇమేజింగ్, ఎముక ఖనిజ సాంద్రత (దీవీణ) పరీక్ష, ఆస్టియోపోరోసిస్ స్క్రీనింగ్,
ఇంప్లాంట్తో జాయింట్ రీప్లేస్మెంట్ ప్యాకేజీలు, ఎముక ఆరోగ్య ప్యాకేజీ, బిఎండి కాల్షియం / విటమిన్ డి ప్రొఫైల్, స్పెషలిస్ట్ కన్సల్టేషన్ (ఎముక బలం, బోలు ఎముకల వ్యాధి నివారణ కోసం) సంప్రదించవచ్చు.

# పశుపతి శర్మ పదవీ విరమణ.

**- శ్రీ వారాహి దేవాలయ ధర్మకర్త మంచాల జ్ఞానేందర్ సత్కారం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



నగరంలోని పద్మశాలి పాఠశాలలో ప్రముఖ విద్యావేత్త పశుపతి శర్మ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యా రంగంలో దశాబ్దాల పాటు సేవలందించిన ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హృదయపూర్వక వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్రీ వారాహి దేవాలయ ధర్మకర్త మంచాల జ్ఞానేందర్ కుటుంబ సమేతంగా కార్యక్రమానికి హాజరై పశుపతి శర్మని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. విద్యా సేవలను సమాజ సేవగా భావించి, వేలాది మంది విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక భావనలు నూరిపోసిన గురువుగా పశు పతి శర్మ సేవలను ఆయన ప్రశంసించారు. గురువు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. పశు పతి శర్మ విద్యార్థుల్లో నైతికత, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక దృక్పథం పెంపొందించడంలో చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి మార్గదర్శకుడిగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# ఆదివాసీ నాయకపోడ్ రాష్ట్రస్థాయి సమావేశం.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం (బి) గ్రామ శివారులోని ఒక ప్రైవేట్ ఫామ్ హౌస్‌లో ఆదివాసీ నాయకపోడ్ రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం ఆదివారం జిల్లా సీనియర్ నాయకుడు, గౌరవ అధ్యక్షుడు బండారి భోజన్న మరియు జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ల సమక్షంలో జరిగింది. ఈ సమావేశంలో కుల సంఘం బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షుడు కూన దయానంద్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెసిలేని రాజన్న మరియు పళ్ళ సత్యనారాయణలు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు పసుల బుచ్చయ్య నేతృత్వంలోని కమిటీ ఆశించిన స్థాయిలో సంఘాన్ని ముందుకు తీసుకెళ్లడం లేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత బాడీని రద్దు13 చేస్తున్నామని, త్వరలోనే నూతన రాష్ట్ర స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నామని వారు ప్రకటించారు. ఈ విషయాన్ని రాష్ట్ర గిరిజన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, అధికారికంగా నూతన బాడీ ఎన్నిక ప్రక్రియను చేపడతామని స్పష్టం చేశారు.
?నూతనంగా ఏర్పడే రాష్ట్ర కార్యవర్గం గ్రామస్థాయి నుంచి కులస్తులను ఏకం చేయడమే కాకుండా, ప్రభుత్వం నుండి అందే సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికి చేరేలా కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు 13 జిల్లాల నుండి ఒక్కొక్క సభ్యునితో కూడిన తాత్కాలిక అడక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంక గారి భూమయ్య, మొసలి చిన్నయ్య, గంజి రాజన్న, భూమయ్య, వేంపల్లి గంగాధర్ భీముడు, శంకర్, లింగన్న,నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 30 మంది ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ సేవలు అభినందనీయం.

## ఇందూరు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ. ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నగర శాఖల సంగమం.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

దేశభక్తి, సేవాభావం, వ్యక్తిత్వ వికాసం వంటి మహత్తర లక్ష్యాలతో సమాజంలో సంఘ్ చేస్తున్న సేవలు అభినందనీయం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. ఇందూరులోని గిరిరాజ్ కాలేజ్ మైదానం, దుబ్బా ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నగర శాఖల సంగమం కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. 1925 విజయదశమి పర్వదినాన స్థాపించబడిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్దోత్సవ వేడుకల సందర్భంగా నగరంలోని అన్ని శాఖలను ఒకే వేదికపై సమీకరించి ఈ సంగమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో ఐక్యత, సోదరభావం, శిస్తు, సేవాస్ఫూర్తి పెంపొందించడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాత్ర విశేషమని పేర్కొన్నారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్త శ్రీ కల్లూరి ప్రభు కుమార్ ప్రసంగించి సంఘ్ సిద్ధాంతాలు, శతాబ్ద ప్రయాణం, భవిష్యత్ కార్యాచరణపై వివరణ ఇచ్చారు. ఈ రోజు కార్యక్రమంలో 50 బస్తీల శాఖలు పాల్గొన్నాయని, ఇందూరు నగరంలో ఆర్ఎస్ఎస్ శాఖ ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా వచ్చే సంవత్సరం జరిగే ఈ కార్యక్రమంలో 75 బస్తీల నుండి శాఖలు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. నగరంలోని స్వయంసేవకులు, ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.








# పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సంబరాలు.




**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి:**

బిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలోని ఇంద్రప్రస్థ వెంచర్‌లో బిబిపేట మండలం మాందాపూర్ 2000--2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల స్నేహ బంధాన్ని సిల్వర్ జూబ్లీగా ఘనంగా జరుపుకున్నారు. ఆత్మీయ వాతావరణంలో నిర్వహించిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహభరితంగా సాగింది. పావు శతాబ్దం తర్వాత కలుసుకున్న సహాధ్యాయులు పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్ననాటి స్నేహాలు, గురువుల బోధనలు, ఆడిపాడిన క్షణాలను తలుచుకుంటూ నవ్వులు పూయించారు. కొందరు తమ అనుభవాలను పంచుకుంటూ జీవిత ప్రయాణంలో స్నేహం ఎంత విలువైనదో వివరించారు.కార్యక్రమం సందర్భంగా పరస్పరం సన్మానాలు, స్మృతిచిహ్నాల అందజేత, కేక్ కటింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులో ప్రతి ఐదేళ్లకోసారి ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేసి స్నేహబంధాలను మరింత బలపరచాలని నిర్ణయించారు. స్నేహం అనే బంధం కాలాన్ని దాటిపోతుందని ఈ సిల్వర్ జూబ్లీ సమ్మేళనం మరోసారి చాటి చెప్పింది. ఈ కార్యక్రమంలో అంకన్న గారి గంగాధర్ గౌడ్, చింతకుంట సుధాకర్ రెడ్డి, గజ్వేల్ విజయ్ కుమార్, యాచం సంతోష్ కుమార్, గజ్వేల్ ఉదయ భాస్కర్, గురజాల సంతోష్ కుమార్, అయిత భాస్కర్, గంగమని, స్రవంతి, రజిత, సరిత, పెద్ద ధనలక్ష్మి, చిన్న ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లోన్ వడ్డీ రేట్లు పెంపు..



కొత్త ఏడాదిలో మీరు హెూమ్ లోన్, పర్సనల్ లోన్ వంటివి తీసుకోవాలని భావిస్తున్నారా? మీకో అలర్ట్. ఐసీఐసీఐ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ సహా మరో రెండు బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచాయి. ఆయా బ్యాంకుల్లో కొత్త వడ్డీ రేట్లు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం. రుణాలు తీసుకునే వారికి పలు బ్యాంకులు ఝలక్ ఇచ్చాయి. ఎంపిక చేసిన టెన్యూర్లపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేట్లు పెంచాయి. దీంతో రుణాలపై వడ్డీ రేట్లు పెరుగుతాయి. అందులో ఐసీఐసీఐ బ్యాంక్ 10 బేసిస్ పేయింట్ల మేర ఎంసీఎల్ఆర్ రేటు పెంచింది. ఆ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ 5 బేసిస్ పాయింట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా 5 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ పెంచింది. ఈ క్రమంలో జనవరి 1, 2024 తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్, పీఎన్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యెస్ బ్యాంకుల్లో లేటెస్ట్ ఎంసీఎల్ఆర్ రేట్లు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకుందాం.

ఐసీఐసీఐ బ్యాంక్ లెండింగ్ రేట్లు.. ఐసీఐసీఐ బ్యాంక్ వెబ్ సైట్ ప్రకారం.. ఎంసీఎల్ఆర్ రేటును 10 బేసిస్ పాయింట్లు పెంచింది. జనవరి 1, 2024 నుంచే అమలులోకి వచ్చాయి. కొత్త రేట్ల ప్రకారం ఓవర్ నైట్ రేటు 8.6 శాతం, నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 8.6 శాతానికి పెంచింది. అలాగే మూడే నెలలో ఎంసీఎల్ఆర్ రేటు 8.55 శాతం నుంచి 8.65 శాతానికి పెంచింది. ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 9 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ రేటును 9.10 శాతానికి పెంచింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్.. బంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటును 5 బేసిస్ పాయింట్లు పెంచింది. కొత్త రేట్లు జనవరి 1, 2024 నుంచే అమలులోకి తీసుకొచ్చింది. దీంతో ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటు 8.25 శాతానికి పెంచింది. నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 8.30 శాతం, మూడు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 8.40 శాతం, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 8.60 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ రేటును 8.70 శాతానికి పెంచింది.

యెస్ బ్యాంక్.. యెస్ బ్యాంకులో ఎంసీఎల్ఆర్ కొత్త రేట్లు జనవరి 1, 2024 నుంచే అమలులోకి వచ్చాయి. ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటు 9.2 శాతంగా ఉంది. నెల రోజుల ఎంసీఎల్ఆర్ వడ్డీ రేటు 9.45 శాతం, మూడు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 10 శాతం, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 10.25 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ రేటు 10.50 శాతంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ ప్రకారం.. జనవరి 1, 2024 నుంచి ఎంసీఎల్ఆర్ రేటును 5 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు బ్యాంక్ తెలిపింది
. దీంతో ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటు 8 శాతానికి చేరింది. నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 8.25 శాతం, మూడు ఎంసీఎల్ఆర్ వడ్డీ రేటు 8.40 శాతం, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.60 శాతంగా ఉండగా.. ఏడాది ఎంసీఎల్ఆర్ రేటు 8.80 శాతంగా ఉంది.

# క్రెడిట్ స్కోర్ చెక్ చేస్కుంటున్నారా?

లోన్ తీసుకునే వారికి, క్రెడిట్ కార్డులు పొందాలనుకున్నా.. తక్కువ వడ్డీకి రుణం కావాలన్నా.. క్రెడిట్ స్కోరు కీలక పాత్ర పోషిస్తుందన్న సంగతి తెలిసిందే. ఇది 750 కంటే ఎక్కువ ఉంటే.. మెరుగైన క్రెడిట్ హిస్టరీ ఉన్నట్లు భావిస్తారు. అయితే దీనిని ఎలా చెక్ చేసుకోవాలో చాలా మందికి తెలియదు. ఇప్పుడు ఫోన్‌పే యూపీఐ యాప్‌లోనే క్రెడిట్ స్కోరు చెక్ చేసుకునే వీలుంది.
ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే యూజర్ల అవసరాలకు అనుగుణంగా కొత్త కొత్త ఫీచర్లు తీసుకొస్తోంది. తాజాగా క్రెడిట్ అనే ఒక కొత్త ఫీచర్ లాంఛ్ చేసింది. దీంట్లో సిబిల్ స్కోరుతో పాటు క్రెడిట్ స్కోరు బిల్లు.. రుణ చెల్లింపుల సమాచారాన్ని సమర్థంగా నిర్వహించుకోవచ్చు. ఇంకా క్రెడిట్ కార్డుల నిర్వహణ, బిల్ పేమెంట్స్, రుణ వాయిదాల చెల్లింపుల వివరాల్ని కూడా ఈ ఫీచర్‌తో సమర్థంగా మేనేజ్ చేసుకోవచ్చని తెలిపింది ఫోన్‌పే. ఇప్పుడు ఈ యాప్‌లో ఉచితంగానే సిబిల్ స్కోరు చెక్ ఎలా చేసుకోవాలనే దాని గురించి తెలుసుకుందాం. ఫోన్‌పే యాప్ ఓపెన్ చేయగానే.. హెూం పేజీలోనే క్రెడిట్ అనే ట్యాబ్ కనిపిస్తుంది. ఒకవేళ అది కనిపించకుంటే యాప్ అప్డేట్ చేసుకోవాలి. క్రెడిట్‌పై క్లిక్ చేస్తే.. క్రెడిట్ స్కోరు ఫర్ ఫ్రీ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దాని కింద చెక్ నౌ అనే బటన్‌పై క్లిక్ చేయాలి. క్రెడిట్ స్కోరు మీకు అక్కడ కనిపిస్తుంది. ఈ స్కోరును ఎక్స్‌పీరియెన్ క్రెడిట్ బ్యూరో అందిస్తుంది. ఈ స్కోరుతో పాటు సకాలంలో పేమెంట్స్, క్రెడిట్ వినియోగ పరిమితి, క్రెడిట్ ఏజ్, క్రెడిట్ మిక్స్, లోన్ ఎంక్వైరీలు వంటి ఇతర సమాచారం కూడా చూసుకోవచ్చు.
ఈ ఫీచర్లో మేనేజ్ క్రెడిట్స్, లోన్ ప్రొఫైల్, పేమెంట్ డ్యూస్ వంటి 3 ఆప్షన్లు కనిపిస్తాయి.



## స్పెషల్ సర్‌ప్రైజ్

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలకు వారి కొత్త సినిమా టీమ్ నుంచి ఓ స్పెషల్ సర్‌ప్రైజ్ అందింది. ఇటీవలే వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంటకు కానుకగా, వారు నటిస్తున్న 'రణబాలి' చిత్రం నుంచి ఓ రొమాంటిక్ మెలోడీ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. "ఎందయ్య సామి" అంటూ సాగే ఈ పాటను శనివారం రిలీజ్ చేశారు. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో విజయ్ 'రణబాలి' అనే పవర్‌ఫుల్ పాత్రలో, రష్మిక 'జయమ్మ'గా కనిపించనున్నారు. తాజాగా విడుదలైన "ఎందయ్య సామి" పాటకు ప్రముఖ సంగీత ద్వయం అజయ్–అతుల్ స్వరాలు సమకూర్చారు. ఈ పాటలో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పండిందని, వారిద్దరినీ చూస్తుంటే 'గీత గోవిందం' రోజులు గుర్తుకొస్తున్నాయని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఈ మెలోడీని తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో విడుదల చేశారు. ఇదిలా ఉంటే, ఈ సినిమాలో 'ది మమ్మీ' ఫేమ్, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఒక కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.



## ఎక్కడా దొరకదు!

చిరంజీవి ఇంటికి వెళ్ళినప్పుడు ఆయన దోశ వేసి ఇచ్చారని, అది మల్లెపువ్వులా ఉందని చెప్పారు రాధిక. చిరంజీవి దోశ'ను గుర్తు చేసుకున్నారు నటి రాధికా శరత్ కుమార్. పలు సంద ర్భాల్లో చిరంజీవి ఇంటికి వెళ్ళినప్పుడు ఆయన దోశ వేసి ఇచ్చారని, అది మల్లెపువ్వులా ఉందని చెప్పారు. అలాంటి దోశ ఎక్కడా తిన లేదని రాధిక అన్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో నటించిన చిత్రం 'సరస్వతి' ప్రియమణి, రావు రమేశ్, ప్రకాశ్‌రాజ్, నాజర్, కిషోర్ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ట్రైలర్ విడుదల





విలక్షణ నటుడు శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'మృత్యుంజయ్'. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తన ఎక్స్ ఖాతా ద్వారా విడుదల చేశారు. తన స్నేహితుడు, ఈ చిత్ర నిర్మాత సన్నీ గుణ్ణం (సందీప్ గుణ్ణం) కోసం ఆయన ఈ ట్రైలర్‌ను లాంచ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ తన స్నేహితుడి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "సన్నీ గుణ్ణం నా జీవితంలో చాలా ఏళ్లుగా ఒక ముఖ్యమైన వ్యక్తి. మా 18 ఏళ్ల స్నేహంలో వాళ్ల నాన్నగారు గుణ్ణం గంగరాజు గారి లాగే ప్రత్యేకమైన కథలను గుర్తించడంలో సన్నీకి మంచి పట్టు ఉందని గమనించాను. అలాంటి ఒక ప్రత్యేకమైన కథతో నిర్మాతగా తన తొలి అడుగు వేస్తున్నందుకు గర్వంగా ఉంది. 'మృత్యుంజయ్' ట్రైలర్ గ్రిప్పింగ్ ఇంటెన్సిటీతో ఉత్కంఠ రేపుతూ, సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మార్చి 6న విడుదలవుతున్న ఈ సినిమాకు దర్శకనిర్మాతలతో పాటు శ్రీవిష్ణుకు, చిత్ర బృందానికి గొప్ప విజయం దక్కాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.

తాజాగా విడుదలైన ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. "నా చేతులు ముళ్లతో కూడిన తాడుతో కట్టేసి ఉన్నాయి. ఆ ముళ్లు విప్పి నీ ప్రశ్నలకు తప్పకుండా సమాధానం చెబుతాను. ఇది నా ప్రామిస్" అంటూ శ్రీవిష్ణు ఒక చిన్నారితో చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. క్రైమ్ బ్యూరోలో పోస్టింగ్ కోసం తన పై అధికారితో ఆయన వాదించడం చూస్తుంటే, ఇందులో శ్రీవిష్ణు జర్నలిస్ట్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు పోలీస్ అధికారిణి పాత్రలో ఉన్న రెబాజాన్ ఒక మరణాన్ని "దురదృష్టకరమైన ప్రమాదం"గా కొట్టిపారేయగా, శ్రీవిష్ణు మాత్రం అది ప్రమాదం కాదని వాదిస్తాడు. పోలియో సోకిన ఎడమ కాలు ఉన్న వ్యక్తి కోసం హీరో వెతకడం, "ఓడిపోతానేమో అని భయంగా ఉంది" అని శ్రీవిష్ణు తన అత్తతో చెప్పినప్పుడు.. "ఓడిపోవడం తప్పు కాదు. కానీ ఓడిపోతామనే భయంతో పోరాడకపోవడమే తప్పు" అని ఆమె చెప్పే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి.

నిజానికి ఈ చిత్రాన్ని ఈ నెల 27న విడుదల చేయాలని భావించినా, కొన్ని కారణాల వల్ల మార్చి 6కి వాయిదా వేశారు. ఈ విషయాన్ని శ్రీవిష్ణు తన ఇన్‌స్టాగ్రామ్‌లో "రిలీజ్ డేట్ మారింది, థ్రిల్ కాదు!" అనే క్యాప్షన్‌తో ప్రకటించారు. లైట్ బాక్స్ మీడియా పతాకంపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించిన ఈ చిత్రానికి రమ్య గుణ్ణం సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు.

## షార్ట్ బ్రేక్..

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించిన రోజా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత సినిమాలకు దూరమయ్యారు. మధ్యలో కొంతకాలం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కనిపించినప్పటికీ, పూర్తి స్థాయిలో రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే ఇప్పుడు మరోసారి కెమెరా ముందుకు వచ్చి రీ ఎంట్రీ ఇవ్వడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.సినిమాలు మానేసినా రోజా ప్రేక్షకులకు దూరం కాలేదు. ప్రముఖ టీవీ షో జబర్దస్త్ ద్వారా ఆమె ఎప్పటికప్పుడు ప్రేక్షకుల ముందుకు వచ్చేవారు. ఆ తర్వాత గత ప్రభుత్వంలో మంత్రి బాధ్యతలు స్వీకరించడంతో ఆ షోకు కూడా గుడ్‌బై చెప్పారు. అయితే ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత రోజా మళ్లీ టీవీ కార్యక్రమాల్లో కనిపించడం ప్రారంభించారు. ఇప్పటికే పలు తెలుగు టీవీ షోలలో గెస్ట్‌గా హాజరవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.

ఇప్పుడు సినిమాల్లోనూ రీఎంట్రీకి సిద్ధమయ్యారు రోజా. తెలుగులో చివరిసారిగా 2013లో, తమిళంలో 2015లో నటించిన ఆమె, దాదాపు దశాబ్దం తర్వాత మళ్లీ తమిళ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఆమె నటించిన తమిళ సినిమా అంబే దయానా టీజర్ విడుదలైంది. ఈ చిత్రంలో పారి ఎలవజగన్, రమ్య రంగనాథన్ జంటగా నటిస్తున్నారు. రోజా ఈ సినిమాలో హీరో తల్లి పాత్రలో కనిపించనున్నారు. టీజర్‌లో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. మరోసారి తల్లి పాత్రలో ఆమె తన అనుభవంతో అద్భుతంగా నటించినట్టు టీజర్ చూస్తేనే అర్థమవుతోంది.

'అంబే దయానా' చిత్రం సమ్మర్‌లో విడుదల కానుంది. దీంతో రోజా అభిమానులు ఈ సినిమాపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో తమిళంలో 'లెనిన్ పాండ్యన్' అనే మరో సినిమాలో కూడా రోజా కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. అందులో ఆమె వయోవృద్ధ మహిళ పాత్రలో కనిపించనున్నారు. తమిళంలో వరుసగా సినిమాలు చేయబోతున్న రోజా, తెలుగు చిత్రాల్లో ఎప్పుడు రీ ఎంట్రీ ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమాల్లోనూ బిజీ అవుతున్న ఆమె, మళ్లీ పూర్తి స్థాయిలో సినీ రంగంలో చురుకుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి, రాజకీయాల తర్వాత మళ్లీ కెమెరా ముందుకు వచ్చిన రోజా 'అంబే దయానా'తో ఎంతవరకు ప్రేక్షకులను ఆకట్టుకుంటారో చూడాలి.





## షరతు..

బాలీవుడ్ సీనియర్ నటుడు సునీల్ శెట్టి తన కుమారుడు అహాన్ శెట్టి నటించిన 'బోర్డర్ 2' సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల గ్రాస్ వసూలు చేసే వరకు తాను చూడనని, ఒక పంతం పెట్టుకున్నానని ఆయన స్పష్టం చేశారు. జనవరి 23న విడుదలైన ఈ సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది.

ఇటీవల ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా సమ్మిట్ 2026'లో సునీల్ శెట్టి మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. 'దేశభక్తితో కూడిన ఈ సినిమా రూ.500 కోట్లు సాధించాలని నేను సినిమా రాకముందే గట్టిగా అనుకున్నాను. ఆ మార్క్ దాటిన తర్వాతే చూస్తానని మొక్కుకున్నా. ప్రస్తుతం సినిమా రూ.489 కోట్ల వద్ద ఉంది. మరో రూ.10–11 కోట్లు ఒక తండ్రి ప్రేమ కోసం దేవుడు ఇస్తాడని ఆశిస్తున్నా' అని ఆయన భావోద్వేగంగా చెప్పారు. సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన 'బోర్డర్ 2' చిత్రం 1997లో వచ్చిన క్లాసిక్ ఫిల్మ్ 'బోర్డర్'కు సీక్వెల్‌గా తెరకెక్కింది. తొలి భాగంలో సునీల్ శెట్టి కూడా కీలక పాత్ర పోషించడం విశేషం.

తన మొక్కు కారణంగా సినిమా ప్రీమియర్‌కు హాజరైనప్పటికీ, థియేటర్ లోపలికి వెళ్లకుండా బయటే ఉండిపోయానని సునీల్ శెట్టి తెలిపారు. ప్రస్తుతం లక్ష్యానికి చేరువలో ఉన్న ఈ చిత్రం త్వరలోనే ఆ మైలురాయిని దాటుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పవర్ ఫుల్ లుక్



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు అన్న రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని ఆరంగేట్ర చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఒక భారీ అప్ డేట్ బయటకు వచ్చింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్రబృందం శనివారం అధికారికంగా ప్రకటించింది.

ఈ సినిమాలో మోహన్ బాబు 'వెంకటప్పయ నాయుడు' అనే పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. వైజయంతీ మూవీస్ సోషల్ మీడియా వేదికగా మోహన్ బాబు ఫస్ట్ లుక్ ను పంచుకుంటూ.. "లెజెండరీ యాక్టర్ మోహన్ బాబు గారిని వెంకటప్పయ నాయుడిగా పరిచయం చేస్తున్నాం. గంభీరత్వం, పౌరుషం కలగలిసిన ఈ పాత్రలో ఆయన నటన అద్భుతంగా ఉండబోతోంది" అని పేర్కొంది. చందమామ కథలు పిక్చర్స్ బ్యానర్ పై పి.కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ సమర్పిస్తున్నారు. జయకృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో వెండితెరకు పరిచయం అవుతున్నారు. గతంలో కృష్ణతో 'అగ్నిపర్వతం', మహేశ్ బాబుతో 'రాజకుమారుడు' వంటి బ్లాక్ బస్టర్లను అందించిన అశ్వనీదత్.. ఇప్పుడు మూడో తరం హీరో జయకృష్ణను లాంచ్ చేస్తుండటం విశేషం. ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగులో ఆమెకు ఇదే తొలి చిత్రం. గ్రామీణ నేపథ్యంలో, వాస్తవికతకు దగ్గరగా ఉండే ఇంటెన్స్ లవ్ స్టోరీగా ఈ చిత్రం రూపొందుతోంది. జయకృష్ణ తన డెబ్యూ కోసం నటన, డ్యాన్స్, ఫైట్స్ లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారని సమాచారం.

## జీవితంలో కలకలం



తమిళ సినీ పరిశ్రమలో ఇళయ దళపతిగా అపా రమైన ప్రజాదరణ సంపా దించిన విజయ్ (విజయ్ జోసెఫ్)కు తమిళనాట ఏ స్థాయిలో క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రజినీకాంత్ తర్వాత కోలీవుడ్‌లో అదే స్థాయి స్టార్డమ్‌ను అందుకున్న హీరోగా విజయ్ గుర్తింపు పొందారు. అయితే అటువంటి స్టార్‌డమ్‌ను పక్కనబెట్టి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత ఆయన జీవితంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సినీ రంగంలో అగ్రస్థానంలో ఉన్న సమయంలోనే రాజకీయాల్లోకి రావడం విజయ్ తీసుకున్న పెద్ద నిర్ణయం. ఈ నిర్ణయం తర్వాత ఆయనపై రాజకీయ ప్రత్యర్థుల నుంచి విమర్శలు, వ్యక్తిగత దాడులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే అభిమానులు మాత్రం ఆయన నిర్ణయానికి మద్దతుగా నిలిచారు.

ఇప్పటికే విజయ్ రాజకీయాల్లో బిజీగా ఉంటుండగా, ఆయన వ్యక్తిగత జీవితంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఆయన భార్య సంగీత సొర్నలింగం విడాకులు కోరుతూ పిటిషన్ వేయడం సంచలనంగా మారింది. ఈ వార్తతో కోలీవుడ్‌తో పాటు అభిమాన వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. అయితే ఈ అంశంపై అధికారికంగా కుటుంబ సభ్యుల నుంచి స్పష్టత రాలేదు.ఇక తాజా టాక్ ఏంటంటే.. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ సోషల్ మీడియాలో తన తండ్రిని అన్‌ఫాలో చేశాడన్న వార్త వైరల్ అవుతోంది. ఇటీవల దర్శకుడిగా తన కెరీర్‌ను ప్రారంభించిన జేసన్ సంజయ్‌కు విజయ్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన విషయం తెలిసిందే. అలాంటి సమయంలో తండ్రినే అన్‌ఫాలో చేయడం కుటుంబంలో అంతర్గత విభేదాలపై అనుమానాలకు తావిస్తోంది.

అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందో అధికారిక సమాచారం లేదు. కానీ నెటిజన్లు మాత్రం ఈ అంశాన్ని విస్తృతంగా చర్చిస్తున్నారు. విజయ్ కుటుంబంలో ప్రస్తుతం ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో అనేది స్పష్టంగా తెలియకపోయినా, వరుసగా వస్తున్న వార్తలు అభిమానులని ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లు, వ్యక్తిగత జీవితంలో మార్పులతో విజయ్ ఇబ్బందులకి గురవుతాడా అనేది చూడాలి. ప్రస్తుతం అయితే విజయ్ తన రాజకీయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు. మరోవైపు జేసన్ సంజయ్ కూడా దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ విషయాలపై స్పష్టత ఎప్పుడు వస్తుందో చూడాలి.

## పవర్‌ఫుల్ పాత్ర



ప్రభాస్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో రూపొందుతున్న పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'స్పిరిట్'. ఈ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రతో వివేక్ ఒబెరాయ్ కనిపించబోతున్నట్లు మేకర్స్ తెలిపారు.

ఈ నేపథ్యంలో విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో ఒబెరాయ్ కమాండింగ్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో, ఇంటెన్స్‌గా కనిపిస్తూ హైస్టేక్స్ యూనివర్స్‌లో తన పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉండబోతుందో చూపించారు. విభిన్న పాత్రలతో తనదైన ముద్ర వేసుకున్న ఆయన రాకతో కథలో కొత్త డైనమిక్ చేరింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లో ఐశ్వర్య దేశాయ్‌ను పరిచయం చేశారు మేకర్స్. ఆమె పాత్ర కథలో చాలా కీలకంగా ఉండనుంది. 'యానిమల్' సంచలన విజయం తర్వాత నిర్మాత భూషణ్ కుమార్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మరోసారి బోల్డ్ క్రియేటివ్ విజన్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రభాస్‌కు జోడిగా తృప్తి డిమ్రి కనిపించనున్నారు. భారీ స్థాయిలో, అద్భుతమైన ఎమోషన్స్‌తో ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ ఇంటెన్స్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించనుంది. 8 భాషల్లో విడుదల కానున్న ఈ పాన్–వరల్డ్ ఎంటర్‌టైనర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. గుల్షన్ కుమార్ సమర్పణలో, టి–సిరీస్ ఫిలిమ్స్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## కెమిస్ట్రీతో

పాన్ ఇండియా స్టార్ నటుడు యశ్, బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' నుంచి తాజాగా విడుదలైన పోస్టర్లు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలోని మొదటి పాట 'తబాహి' కి సంబంధించి మేకర్స్ విడుదల చేసిన రొమాంటిక్ అప్‌డేట్స్ ఇప్పుడు ఫ్యాన్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'తబాహి'ని మార్చి 2న మధ్యాహ్నం 12:59 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో యశ్ షర్ట్‌లెస్ లుక్‌లో కనిపిస్తుండగా, కియారా అద్వానీ ఆయనను బిగి కౌగిలిలో బంధించిన రొమాంటిక్ స్టిల్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. సముద్రపు తీరంలో సూర్యాస్తమయ వేళ వీరిద్దరి కెమిస్ట్రీ పోస్టర్లలో పీక్స్‌లో కనిపిస్తోంది.



ఈ సినిమాలో యశ్ 'రాయ' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తుండగా, కియారా అద్వానీ 'నదియా'గా కనిపించనుంది. వీరు కాకుండా నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా మరియు రుక్మిణి వసంత్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం 1940,70ల మధ్య గోవా బ్యాక్‌డ్రాప్‌లో సాగే గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు సమాచారం.